
DD9 వార్త
వాస్తవాలు పలుకు
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక


## కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతే కేంద్రబిందువు – సబ్సిడీపై పత్తి విత్తనాల పంపిణీ


03






హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 52 | 04-07-2026 శనివారం | పేజీలు: 08 | వెల: 3/-





# జీవో 111కు తూట్లు







## సీఎంసీ పరిధిలో అంతులేని అక్రమ నిర్మాణాలు

- చెరువు నాలాల పరిరక్షణ సరే
- జంట జలాశయాలా పరిస్థితి ఏంటి
- చెరువులు కుంటల పరిరక్షణకేనా హైడ్రా?
- జంట నగరాలకు త్రాగునీరు అందించే జంట జలాశయాలను విస్మరించారా?
- ఒక్క కమిషనరేట్ ఉన్నప్పుడే మేలు
- మూడు కమీషనరేట్లున్న ప్రయోజనం శూన్యం

## ముఖ్యమంత్రి శాఖలోనే అవినీతి తాండవిస్తోంది

- కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ నిర్మాణదారులు
- అక్రమ నిర్మాణ దారులకు బ్రదర్స్ అండ
- గడపదాటని సీఎంసీ కమీషనర్ సృజన
- "మామూళ్ల"తో సరే అంటున్న క్షేత్ర స్థాయి అధికారులు
- అవినీతికి అడ్డాగా టౌన్ ప్లానింగ్ విభాగం?








డీడీ 9 వార్తలో ప్రచురితమైన వరుస కథనాలు

**జంట జలాశయాలను పరిరక్షిస్తూ హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు త్రాగునీటి భద్రత కల్పించేందుకు తీసుకొచ్చిన 111 జీఓ అమలు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.** జీవో 111 పరిధిలో 84 గ్రామాలను మినహాయిస్తూ 10 కిలో మీటర్ల విస్తీర్ణం లో భావి తరాల భవిష్యత్తు కోసం ఉమ్మడి రాష్ట్రల ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి అర్జునరావు నేతృత్వంలో 1993 లో జీవో 111 పేరుతో ఉత్తర్వులను జారీ చేసారు. చెరువు నాలాలు బఫర్ జోన్ లు ఆక్రమణకు గురైతే వెంటనే స్పందించే హైడ్రా అధికారులు మహానగరానికి ప్రాణాదారమైన త్రాగు నీరు అందించే నీటి వనరులైన ఉస్మాన్ ,హిమాయత్ సాగర్ లు అక్రమార్కుల చెరలో చిక్కి శెల్యమవుతుంటే ఎందుకు స్పందిం చడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు .. దీంతో జీవో 111 నియమ నిబంధనలను తుంగలో తొక్కి బ్రదర్స్ సారథ్యంలో సాగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాల పై ఏ ఒక్క అధికారి నోరు మెదపక పోవ దం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఆనాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం 111 జీవో లో ఉన్న ఆస్తులను కాపాడుకునేందుకు ఏకంగా జీవో 111 నే సడలించేందుకు కుయుక్తులు పన్నారు పలు మార్లు ఎన్జీటీ ని ఆశ్రయించారు అయినప్పటికీ ప్రభుత్వానికి ఎన్ జి టీ నుండి చుక్కెదురైంది. దీంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పాలకుల యొక్క అత్యాశకు చెక్కు పెట్టింది. అదే సమయంలో కొడంగల్ ఎంఎల్ ఏ గా ఉన్న రేవంత్ రెడ్డి 111 జీవో ను పరిరక్షించాలని వందలాది పిర్యాదులు (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ )ఎన్ జి టీ కి చేసింది వాస్తవం కదా ? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేటికి రెండున్నర సంవత్సరాలు పూర్తి అయింది కానీ ఆనాడు 111 జీవో ను కాపాడాలని వందలాది పిర్యాదులు చేసిన రేవంత్ రెడ్డి వందలాది బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

8లో

డిడి9 వార్త, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ విభాగం హైదరాబాద్



## యాప్‌తో బయటపడిన యూరియా మాఫియా..!

**సిద్దిపేటలో యూరియా పంపిణీలో వరుస అక్రమాలు**
**బైరాన్‌పల్లిలో రైతుకు అందాల్సిన 18 బస్తాలు మాయం**
**యాప్ అలర్ట్‌తో బయటపడిన వ్యాపారుల నిర్వాకం**
**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్**

హైదరాబాద్, (డిడి9 వార్త):

సిద్దిపేట జిల్లాలో యూరియా పంపిణీ వ్యవహారం వరుస అక్రమాలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వం పారదర్శకత కోసం తీసుకువచ్చిన యాప్, వ్యాపారుల అక్రమాలను బట్టబయలు చేస్తోంది. కాసులకు కక్కుర్తి పడుతున్న కొందరు వ్యాపారులు, రైతులకు అందాల్సిన యూరియాను పక్కదారి పట్టిస్తూ, కృత్రిమ కొరతను మిగతా 2లో..

## బీఆర్ఎస్ అప్పులపై భట్టి ఆగ్రహం

**మాజీ మంత్రి హరీశ్ పై డిప్యూటీ సీఎం ఆరోపణలు**
**రూ.8.21 లక్షల కోట్ల లెక్కలు చెప్పాలని డిమాండ్**
**సచివాలయం వేదికగా డిప్యూటీ సీఎం ప్రెస్ మీట్**
**ప్రతిపక్షాల అసత్య ప్రచారాలపై నిప్పులు**
**అబద్ధాల పునాదులపైనే పదేళ్ల బీఆర్ఎస్ పాలన**
**కేటీఆర్, హరీశ్‌రావు ద్వయంపై ఘాటు విమర్శలు**
**రాష్ట్రం నెత్తిన రూ.8.21 లక్షల కోట్ల గుదిబండ**
**భారీ అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్**
**రెండున్నరేళ్లలోనే రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీల చెల్లింపు**
**అప్పుల రీస్ట్రక్చరింగ్‌తో భారీగా తగ్గిన వడ్డీల మోత**




హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా మాజీ ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్ రావు సోషల్ మీడియా వేదికగా, బహిరంగ సభల్లో పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన మిగతా 2లో..

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది బిగ్‌బాస్ షో

**కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు**
**వచ్చే ఎన్నికల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఖాయం**
**తెలంగాణలో పొలిటికల్ బిగ్‌బాస్ డ్రామా**
**రెండు ప్రధాన పార్టీలపై బండి సెటైర్లు**
**కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవినీతి కవల పిల్లలు**
**ప్రజలను మోసం చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి ధ్వజం**
**రెండు పార్టీలను ఎలిమినేట్ చేసేందుకు ప్రజలు సిద్ధం**
**రెండేళ్లు దాటినా కల్వకుంట్ల కుటుంబంపై చర్యలు శూన్యం**
**సిట్ విచారణ పేరుతో కాలయాపన రాజకీయాలు**
**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టిన బండి సంజయ్**



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ ప్రస్తుత రాజకీయాలు ఒక బుల్లితెర వినోద కార్యక్రమంగా మారిపోయాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రమైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి మధ్య ప్రస్తుతం ఒక పెద్ద 'బిగ్‌బాస్ షో' నడుస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. కరీంనగర్ నగరంలో నిర్వహించిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు పార్టీలు ప్రజల సమస్యలను పక్కనబెట్టి, కేవలం ఒకరిపై ఒకరు నకిలీ విమర్శలు చేసుకుంటూ మిగతా 2లో..

## జూపల్లి సవాళ్లు మాటలకే పరిమితం..

**మొదటిపేజీ తరువాయి**

కొత్త షరతులు పెడుతున్నారని విమర్శించారు. జూపల్లి ఇటీవల వాట్సాప్‌లో విడుదల చేసిన లేఖలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పుల వివరాలను ప్రస్తావించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఆ లేఖలోనే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.77 లక్షల కోట్ల అప్పులు చేశామని మంత్రి స్వయంగా పేర్కొన్నారని అన్నారు.

ఆర్‌బీఐ ద్వారా తీసుకున్న ఎఫ్ఆర్‌బీఎం రుణాల పూర్తి వివరాలను తాము వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రూ.1.86 లక్షల కోట్ల అప్పు చేసిందని పేర్కొంటూ, ఆర్‌బీఐ నుంచి తీసుకున్న రుణాల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తోందని, ప్రస్తుతం డ్యామేజ్ కంట్రోల్‌లో భాగంగానే వివరణలు ఇస్తోందని విమర్శించారు. ప్రభుత్వం అప్పులపై పూర్తి శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ అప్పులపై భట్టి ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

సచివాలయంలో భట్టి విక్రమార్క అత్యవసర మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత గులాబీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని, అడ్డగోలు అప్పుల తాలూకు నిజాలను శ్వేత పత్రం తరహాలో లెక్కలతో సహా బయటపెట్టి సంచలనం సృష్టించారు.

మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో తానే స్వయంగా రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించాననే కనీస జ్ఞానం కూడా లేకుండా హరీశ్ రావు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాటు కేవలం అబద్ధాల పునాదులపైనే నకిలీ పరిపాలన సాగించింది. తాము చేసిన అక్రమాలను, అడ్డగోలు అప్పులను కప్పిపుచ్చుకోవడానికే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ కలిసి ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు" అని దుయ్యబట్టారు. వారి ఉనికిని చాటుకోవడానికే ఇప్పుడు హడావిడి చేస్తున్నారని విమర్శించారు.

గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏ స్థాయిలో అప్పుల ఊబిలోకి నెట్టిందో భట్టి విక్రమార్క వివరించారు. బీఆర్ఎస్ పాలన ముగిసే సమయానికి రాష్ట్రం చేసిన మొత్తం అప్పులు అక్షరాలా రూ.8.21 లక్షల కోట్లకు చేరిందని ఆయన అధికారిక గణాంకాలను వెల్లడించారు. ఈ భారీ మొత్తంలో గత ప్రభుత్వం వివిధ కాంట్రాక్టర్లకు, సంస్థలకు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన వేల కోట్ల రూపాయల బకాయిలు కూడా కలిసి ఉన్నాయని స్పష్టం చేశారు. ఇంతటి ఘోరమైన ఆర్థిక సంక్షోభానికి కారకుడైన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.

గత పాలకులు చేసిన అనాలోచిత అప్పుల వల్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై పడుతున్న అదనపు భారాన్ని ఆర్థిక మంత్రి భట్టి వివరించారు. బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన అప్పులకు గానూ, గడిచిన రెండున్నరేళ్ల కాలంలోనే తమ ప్రభుత్వం అసలు మరియు వడ్డీల రూపంలో ఏకంగా రూ.2,08,061 కోట్లను బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇంతటి పెను భారాన్ని నెత్తిన మోస్తూ కూడా, ప్రజా ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా పేద ప్రజల సంక్షేమ పథకాలను, గ్యారంటీలను నిరంతరాయంగా విజయవంతంగా అమలు చేస్తోందని ఆయన గర్వంగా ప్రకటించారు.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం అత్యధిక వడ్డీ రేట్లకు విచ్చలవిడిగా అప్పులు తెచ్చిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ.. ఆ భారీ వడ్డీ అప్పులను బ్యాంకర్లతో మాట్లాడి 'రీస్ట్రక్చరింగ్' చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ చాకచక్యమైన ఆర్థిక నిర్వహణ కారణంగా గతంలో ఏటా కట్టాల్సిన రూ.34 వేల కోట్ల వడ్డీ భారాన్ని, ఇప్పుడు రూ.11 వేల కోట్లకు తగ్గించగలిగామని వివరించారు. కేసీఆర్, హరీశ్ రావులకు గతం లేదు, భవిష్యత్తూ లేదు కాబట్టే ఇలాంటి వాస్తవాలను జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆర్థికాంశాలతో పాటు తెలంగాణకు తలమానికమైన సింగరేణి కాలరీస్ సంస్థను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు సింగరేణి కార్మిక ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధపు హామీలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. "మీ పదేళ్ల సుదీర్ఘ కాలంలో సింగరేణి సంస్థ పరిధిలో కనీసం ఒక్క కొత్త కోల్ బ్లాక్‌నైనా అందుబాటులోకి తెచ్చారా? ఇన్నాళ్లూ కొత్త బొగ్గు గనులు రాకుండా అడ్డుపడి, సంస్థను నష్టాల్లోకి నెట్టిందే బీఆర్ఎస్ నాయకులు" అని నిలదీశారు. సింగరేణి సంస్థ పరిధిలో కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని, అక్కడ నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెపూనే.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము చాలా సీరియస్‌గా ఉన్నామని మంత్రి భట్టి స్పష్టం చేశారు. గతంలో పెద్ద ఎత్తున బొగ్గు అక్రమ రవాణా జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే తాము సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌కు పూర్తిస్థాయి విచారణ జరపాలని కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ అక్రమాలకు కారణమైన ఎంతటి వారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును కాపాడేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. నూతన కోల్ బ్లాక్‌లను సింగరేణికే దక్కించుకునేలా తాము నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. లాభాల బాటలో పయనించేలా సింగరేణిని పునర్నిర్మిస్తున్నామని.. రాత్రింబవళ్లు కష్టపడే కార్మికుల ప్రయోజనాలను, వారి హక్కులను ప్రజా ప్రభుత్వం అన్ని వేళలా కాపాడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

## యాప్‌తో బయటపడిన యూరియా మాఫియా..!

**మొదటిపేజీ తరువాయి**

సృష్టిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, వ్యాపారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చేర్యాల ఘటన మరువకముందే.. బైరాన్ పల్లిలో మరో అక్రమం**



జిల్లాలోని చేర్యాలలో సుమారు 6,429 యూరియా బస్తాలు మాయమైన ఘటన మరువకముందే, తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. బైరాన్ పల్లిలోని రైతు సేవా కేంద్రం నుంచి రైతుకు అందాల్సిన 18 యూరియా బస్తాలు నిర్వాహకుడు అక్రమంగా మాయం చేశాడు. ధూళ్మిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన రైతు కుమార్, తన యూరియా బస్తాల కోసం బుక్ చేసుకున్నారు. అయితే, తాను యూరియా తీసుకోకముందే, బస్తాలు తీసుకున్నట్లుగా ఫోన్‌కు మెసేజ్ రావడంతో సదరు రైతు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. ఈ అక్రమంపై రైతు కుమార్ రైతు సేవా కేంద్రం నిర్వాహకుని వెళ్లి నిలదీయగా, ఆయన ఏమాత్రం బాధ్యత లేకుండా నిర్లక్ష్యపు సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. యూరియా అక్రమాలపై ఉన్నతాధికారులు అడపాదడపా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో యూరియా మాఫియా ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ప్రభుత్వ యాప్‌లో వస్తున్న అలర్ట్‌ల ద్వారా అక్రమాలను బయటపెడుతున్నా, చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# హనీమూన్ హత్య కేసులో సుప్రీం కీలక నిర్ణయం

- **సోనమ్ రఘువంశీ బెయిల్‌పై స్టేకు నిరాకరణ**
- **విడుదలైనందున జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం**
- **కోర్టులో సొలిసిటర్ జనరల్ తుషార్ కీలక వాదనలు**
- **సాంకేతిక కారణాలతో బెయిల్ ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం**
- **విగ్గు పెట్టుకున్నాడని కాబోయే భర్తను చంపిన కేసు ప్రస్తావన**
- **పెరుగుతున్న దారుణాలపై ఎస్‌జీ ఆందోళన**
- **పోలీసుల తప్పిదాల వల్లే లభించిన ఊరట**
- **అరెస్ట్ మెమోలో లోపాలను గుర్తించిన షిల్లాంగ్ కోర్టు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలిగా ఉన్న సోనమ్ రఘువంశీకి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఆమెకు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై తక్షణమే స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. నిందితురాలు సోనమ్ ఇప్పటికే జైలు నుంచి విడుదలయిందని, అంతేకాకుండా కోర్టు విధించిన అన్ని రకాల షరతులను ఆమె నిశితంగా పాటిస్తున్నందున, ప్రస్తుత తరుణంలో ఆమె బెయిల్‌ను రద్దు చేయాల్సిన అత్యవసర అవసరం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది.

ఈ కేసు విచారణ సందర్భంగా మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వం తరపున దేశ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో అత్యంత కీలకమైన వాదనలు వినిపించారు. సోనమ్ రఘువంశీపై మోపబడిన హత్య ఆరోపణలు చాలా గంభీరమైనవని, సమాజంపై తీవ్ర ప్రభావం చూపే ఇలాంటి కేసుల్లో కేవలం సాంకేతిక లోపాలను సాకుగా చూపి నిందితులకు బెయిల్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఆదేశాల వల్ల విచారణ దెబ్బతినే ప్రమాదం ఉందని, అందుకే ఆమెను వెంటనే మళ్లీ జైలుకు పంపేలా స్టే ఇవ్వాలని గట్టిగా కోరారు.

వాదనల సమయంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాజంలో పెరిగిపోతున్న క్రూరత్వాన్ని ప్రస్తావిస్తూ ఇటీవల వెలుగులోకి వచ్చిన 'సియా కేతన్' కేసును ఉదాహరణగా చెప్పారు. కేవలం తలపై విగ్గు పెట్టుకున్నాడనే ఒక చిన్న కారణంతో ఒక యువతి తాను పెళ్లి చేసుకోబోయే కాబోయే భర్తను అతి దారుణంగా చంపేసిన ఉదంతాన్ని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలాంటి కేసుల తర్వాత సమాజంలో భార్యాభర్తల బంధాల మధ్య ఇటువంటి ఘోరాలు మరింతగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత సుప్రీంకోర్టు కూడా బెయిల్ రద్దుకే మొగ్గు చూపినప్పటికీ, ఆమె ఇప్పటికే జైలు బయట ఉన్నందున కఠినంగా వ్యవహరించడం లేదని వ్యాఖ్యానించింది.

గతంలో ఏప్రిల్ నెలలో మేఘాలయలోని షిల్లాంగ్ కోర్టు సోనమ్‌కు మొదటిసారి బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈ బెయిల్ రావడం వెనుక పోలీసులు చేసిన ఒక పెద్ద తప్పిదం ఉందనే వార్తలు అప్పట్లో గుప్పుమన్నాయి. కేసు నమోదు చేసే సమయంలో చట్టపరమైన సెక్షన్ల విషయంలో, అలాగే అరెస్ట్ మెమోతో పాటు కేసుకు సంబంధించిన దర్యాప్తు పత్రాల్లో పోలీసులు తీవ్రమైన లోపాలకు తావిచ్చారని షిల్లాంగ్ కోర్టు గుర్తించింది. పోలీసులు దీనిని కేవలం సాంకేతిక పొరపాటుగా వాదించినప్పటికీ, కోర్టు ఆ వాదనను తిరస్కరిస్తూ.. సోనమ్ అరెస్టుకు చూపిన కారణాలు చట్టబద్ధంగా సరైనవిగా లేవని పేర్కొంటూ ఆమెకు బెయిల్ ఇచ్చింది.

ఈ దారుణ హత్య ఉదంతం గత ఏడాది చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరానికి చెందిన రాజా రఘువంశీ కుటుంబానికి పెద్ద ఎత్తున ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం ఉంది. గత ఏడాది మే 11న రాజా రఘువంశీకి, సోనమ్‌తో ఎంతో వైభవంగా వివాహం జరిగింది. పెళ్లయిన కొన్ని రోజులకే, అనగా మే 20వ తేదీన ఈ కొత్త జంట హనీమూన్ పర్యటన కోసం ఎంతో సంతోషంగా మేఘాలయ రాష్ట్రానికి వెళ్లారు. అయితే అక్కడికి వెళ్లిన కొద్ది రోజులకే ఇద్దరూ కనిపించకుండా పోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు గాలించగా.. సుమారు 11 రోజుల తర్వాత సోహ్రా ప్రాంతంలోని ఒక జలపాతం సమీపంలో ఉన్న లోతైన లోయలో రాజా రఘువంశీ మృతదేహం కత్తిగాట్లతో దారుణమైన స్థితిలో లభ్యమైంది.

భర్త శవం దొరికిన సమయంలో భార్య సోనమ్ అక్కడ కనిపించకపోవడంతో పోలీసులకు ఆమెపైనే మొదటి అనుమానం వచ్చింది. ఆమె కోసం దేశవ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టగా, జూన్ 7వ తేదీన సోనమ్ హఠాత్తుగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గాజీపూర్ ప్రాంతంలో ప్రత్యక్షమైంది. తక్షణమే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అసలు నిజం బయటపడింది. పెళ్లికి ముందే ఉన్న తన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో కలిసి, పక్కా ప్లాన్ ప్రకారమే హనీమూన్ నెపంతో భర్తను మేఘాలయకు పిలుచుకొచ్చి అక్కడ హతమార్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో పోలీసులు సోనమ్‌తో పాటు ఆమె ప్రియుడు రాజ్ కుశ్వాహా, వారికి సహకరించిన మరో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు.

షిల్లాంగ్ కోర్టు సోనమ్‌కు బెయిల్ ఇచ్చే సమయంలో రూ.50,000 విలువైన వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని ఆదేశించింది. దాంతో పాటు అనేక కఠినమైన షరతులను కూడా విధించింది. బెయిల్ కాలంలో ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ షిల్లాంగ్ కోర్టు అధికార పరిధిని దాటి ఇతర ప్రాంతాలకు లేదా రాష్ట్రాలకు వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే, ముందే కోర్టుకు రాతపూర్వకంగా తెలియజేసి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొంది. అలాగే, ఈ కేసులోని సాక్షులను బెదిరించడానికి లేదా ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే బెయిల్ తక్షణమే రద్దవుతుందని హెచ్చరించింది.

భర్తను హనీమూన్‌లో ప్రియుడితో కలిసి చంపిన విషయం బయటకు రాగానే సోనమ్ రఘువంశీ సొంత కుటుంబ సభ్యులు కూడా ఆమెను అసహ్యించుకున్నారు. తాము ఆమెతో ఉన్న అన్ని రకాల రక్తసంబంధాలు, కుటుంబ బంధాలను పూర్తిగా తెంచేసుకుంటున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుడు రాజ్ రఘువంశీ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని సోనమ్ సొంత సోదరుడు మీడియా ముఖంగా వెల్లడించారు. చట్టపరంగా గానీ, వ్యక్తిగతంగా గానీ జైల్లో ఉన్న సోనమ్‌కు తమ కుటుంబం నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందించబోమని ఆయన స్పష్టం చేయడం గమనార్హం.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది బిగ్‌బాస్ షో

**మొదటిపేజీ తరువాయి**



కాలం గడుపుతున్నాయని, ఈ పొలిటికల్ డ్రామాను ప్రజలంతా గమనిస్తున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలు రెండూ అవినీతి పునాదులపైనే నడుస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ఈ రెండు పార్టీల అంతిమ లక్ష్యం ప్రజల సంపదను దోచుకోవడమేనని మండిపడ్డారు. అధికారంలో ఎవరున్నా అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోయిందని, గత పాలకులు చేసిన తప్పులను ప్రస్తుత పాలకులు కప్పిపుచ్చుతున్నారని విమర్శించారు. ఒకరి అవినీతిని మరొకరు వాడుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో రెండు పార్టీలు ఒక్కటేనని ఆయన ధ్వజమెత్తారు.

తెలంగాణ రాష్ట్ర ప్రజలు చాలా వివేకవంతులని, విజ్ఞులని బండి సంజయ్ కొనియాడారు. బిగ్‌బాస్ హౌస్ నుండి అనర్హులను ఎలాగైతే ఓటర్లు ఎలిమినేట్ చేస్తారో, అదే విధంగా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను తెలంగాణ రాజకీయాల నుండి ప్రజలు శాశ్వతంగా ఎలిమినేట్ (తొలగించడం) చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్ర ప్రగతి కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని, అందుకే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో నిశ్చయంగా 'డబుల్ ఇంజిన్ సర్కార్' (కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం) కు ప్రజలు ఘనంగా పట్టం కట్టబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా.. గత పాలకుల అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని బండి సంజయ్ తీవ్రంగా తప్పుపట్టారు. ఎన్నికల ముందు కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతిపై జైలుకు పంపుతామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, ఇన్నాళ్లయినా కల్వకుంట్ల కుటుంబంలో ఏ ఒక్కరిపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిని బట్టే సీఎం రేవంత్ రెడ్డి నిజాయితీ ఏంటో ప్రజలకు పూర్తిగా అర్థమైపోయిందని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఏ పెద్ద కుంభకోణం జరిగినా లేదా వివాదం రేగినా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ప్రత్యేక విచారణ బృందం పేరుతో కాలయాపన చేస్తోందని కేంద్ర మంత్రి విమర్శించారు. సిట్ విచారణల వల్ల ఇప్పటివరకు ఏ ఒక్క అవినీతి తిమింగలానికి కూడా శిక్ష పడలేదని, అది కేవలం ప్రజల దృష్టిని మళ్లించేందుకేనని ఆరోపించారు. విచారణల పేరుతో కాలం వెళ్లదీస్తూ, కాలపట్టికను పొడిగించుకుంటూ పోవడం రేవంత్ సర్కార్‌కు అలవాటుగా మారిందని, ఇదంతా కేవలం డ్రామాలో భాగమేనని సంజయ్ దుయ్యబట్టారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ ఉదంతాన్ని బండి సంజయ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సామాన్య భార్యాభర్తల వ్యక్తిగత ఫోన్ సంభాషణలను కూడా అప్పటి అధికారులు, పాలకులు దొంగతనంగా విన్నారని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే గతంలో ఒప్పుకున్నారని గుర్తు చేశారు. అంతటి తీవ్రమైన నేరం జరిగినప్పుడు, అన్ని ఆధారాలు చేతిలో ఉన్నప్పుడు కూడా ఇప్పటివరకు అసలైన సూత్రధారులను ఎందుకు బోనులో నిలబెట్టలేదని, కేవలం కింది స్థాయి అధికారులను బలిచేసి పెద్దలను ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు పగటిపూట మీడియా ముందు ఎంతగా కొట్టుకుంటున్నట్లు నటించినా, తెరవెనుక మాత్రం వారిద్దరూ ఒకటేనని బండి సంజయ్ అన్నారు. ఈ రెండు పార్టీల డ్రామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఇకముందు వాళ్ల ఆటలు సాగవని హెచ్చరించారు. పరస్పరం ఆరోపణలు చేసుకునే క్రమంలోనే ఒకరి అవినీతి బండారాన్ని మరొకరు స్వయంగా బయటపెట్టుకుంటున్నారని, ఇది వారి కుమ్మక్కు రాజకీయాలకు అద్దం పడుతోందని విమర్శించారు. ఈ డ్రామాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ రాజకీయ వినోదానికి తాము ఎలాంటి ఆటంకం కలిగించదలుచుకోలేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. వారు చేస్తున్న డ్రామాలను ప్రజలకే వదిలేసి, తాము మాత్రం పార్టీ పరంగా నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోతున్నామని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా క్షేత్రస్థాయిలో బలమైన గ్రౌండ్ వర్క్ (సన్నాహక పనులు) ఇప్పటికే ప్రారంభించామని చెప్పారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని, తెలంగాణను అవినీతి రహిత రాష్ట్రంగా మార్చేందుకు బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన ప్రసంగాన్ని ముగించారు.

## తెలంగాణలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

**మొదటిపేజీ తరువాయి**



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగానే ఇటీవల నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని పనులను అధికారికంగా ప్రారంభించామని గుర్తుచేశారు. రానున్న రెండేళ్ల కాలంలో తెలంగాణలోని ఏ మూలన చూసినా నాణ్యమైన ఆర్అండ్‌బీ డబుల్ రోడ్లే కనిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "మంచి రోడ్డు ప్రగతికి సూచిక" అని తాము బలంగా నమ్ముతున్నామని, దీనివల్ల పల్లెలకు, పట్టణాలకు రవాణా సదుపాయం పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పరిశ్రమలు వస్తాయని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని వివరించారు.

రాష్ట్రవ్యాప్త రహదారుల నెట్‌వర్క్ ఆధునికీకరణ కోసం మొదటి ఫేజ్‌లో సుమారు రూ. 13,000 కోట్ల భారీ అంచనా వ్యయంతో మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవునా రోడ్ల పనులను 34 ప్యాకేజీలుగా విభజించి చేపట్టబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుత జూలై నెలలోనే 10 ప్యాకేజీలకు సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్ 2 పరిధిలో సుమారు రూ. 155 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 42 కిలోమీటర్ల పొడవైన నల్లగొండ మహబూబ్‌నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే మొదలయ్యాయని, ఈ పనుల వేగాన్ని మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని, అయినప్పటికీ రాబోయే రోజుల్లో వర్షాకాలం పూర్తిగా ముగిసిన వెంటనే రోడ్ల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో కూడా కలిపి మొత్తం మూడు షిఫ్టులలో పనులు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పనుల పర్యవేక్షణ కోసం సాంకేతిక నైపుణ్యం ఉండి, నిరంతరం ఫీల్డ్‌లోనే ఉండేలాంటి సమర్థులైన ఇంజినీర్లను ఎంపిక చేసి ప్యాకేజీల వారీగా బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ఇచ్చిన గడువులోగా పనులను నాణ్యతతో పూర్తి చేయించడం చీఫ్ ఇంజినీర్ల పూర్తి బాధ్యత అని తేల్చిచెప్పారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 6వ తేదీన కరీంనగర్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే హ్యామ్ , అలాగే సీఆర్ఎఫ్ రోడ్ల పనులకు భూమిపూజ చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఆ జిల్లాకు చెందిన మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి తానే స్వయంగా ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటానని వెల్లడించారు. ఈ లోపే దానికి సంబంధించిన అన్ని రకాల అధికారిక ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాజేంద్రనగర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవనం, జడ్జిల నివాస సముదాయాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిరంతర నిఘా ఉంచారని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు అక్కడ కేవలం 16 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని అధికారులు వివరించగా, మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై మూడు షిఫ్టుల్లో పనులు జరగాలని, కార్మికుల సంఖ్యను భారీగా పెంచి నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకోవాలన్నారు. అక్కడ ఆర్అండ్‌బీ తరపున పర్యవేక్షించే ఇంజినీర్ల సంఖ్యను కూడా పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి కొత్త హైకోర్టు భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని డెడ్‌లైన్ విధించారు. అదేవిధంగా, చారిత్రాత్మక ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనుల్లో కూడా వేగం పెంచి, దానిని కూడా 2027 డిసెంబర్ నాటికే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులపైన కూడా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష చేశారు. సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి భవనం ఇప్పటికే పూర్తిగా నిర్మాణమై ప్రారంభానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. దీనితో పాటు అల్వాల్ టిమ్స్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పనులతో పాటు వరంగల్‌లో నిర్మిస్తున్న అతిపెద్ద మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను వేగవంతం చేయాలని అధికారులను పురమాయించారు. ఈ ప్రాజెక్టులన్నీ అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా రాత్రింబవళ్లు శ్రమించాలని సూచించారు.

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ మెగా ప్రాజెక్టుల్లో కేవలం టెక్నికల్ నాలెడ్జ్ ఉండి, మనసుపెట్టి పనిచేసే నిబద్ధత (కమిట్‌మెంట్) గల ఇంజినీర్లను మాత్రమే నియమించాలని మంత్రి ఉన్నతాధికారులకు సూచించారు. తానే స్వయంగా ఈ వారం నుంచే నిర్మాణాలు జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక సైట్ విజిట్స్ (సైట్ తనిఖీలు) చేస్తానని స్పష్టం చేశారు. పనుల పురోగతిలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహించినట్లు లేదా నాణ్యత లోపించినట్లు తన దృష్టికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర, భద్రాచలం ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం ఆర్అండ్‌బీ తరపున చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా మంత్రి ఆరా తీశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సీ జయ భారతి, అన్ని విభాగాల సీఈలు బీవీ రావు, రాజేశ్వర్ రెడ్డి, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, వనజ, రాజేందర్, నర్సింగ్ రావు మరియు పలువురు ఆర్అండ్‌బీ ఉన్నత శ్రేణి ఇంజినీర్లు పాల్గొన్నారు.

DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
శనివారం
04-07-2026
హైదరాబాద్

# కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతే కేంద్రబిందువు – సబ్సిడీపై పత్తి విత్తనాల పంపిణీ

**ఆదిలాబాద్ జిల్లా బోథ్ జులై 03 (డిడి 9 వార్త ):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని .నేరడిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్సిడీపై పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ,రైతులకు 192 పత్తి విత్తనాల సంచులను పంపిణీ చేశారు.*ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతును ఆదుకోవడమే లక్ష్యంగా వ్యవసాయానికి అవసరమైన ప్రతి రంగంలో చేయూత అందిస్తోందన్నారు. నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించడం ద్వారా రైతుల సాగు వ్యయాన్ని తగ్గిస్తూ, అధిక దిగుబడులు సాధించే అవకాశాన్ని కల్పిస్తోందని తెలిపారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కందులు, సోయాబీన్ మరియు పత్తి విత్తనాలను 100 శాతం సబ్సిడీపై అందించడం ద్వారా రైతులపై సాగు పెట్టుబడి భారాన్ని గణనీయంగా తగ్గించిందన్నారు. ఈ నిర్ణయం రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారి వ్యవసాయ ఉత్పాదకత పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.అలాగే రైతుల అభ్యున్నతి కోసం రైతు భరోసా, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా,పంటల అభివృద్ధికి అవసరమైన వ్యవసాయ సలహాలు, మార్కెటింగ్ సౌకర్యాల కల్పన వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే



ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతు బంధువులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే సమగ్ర వికాసం : నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

విద్యతో పాటు క్రీడలు బాలికల జీవితంలో క్రమశిక్షణను, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. శుక్రవారం నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గర్ల్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 202627 ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రీడలు కేవలం ఆటలకే పరిమితం కాదని, అవి ఆత్మవిశ్వాసాన్ని, మానసిక దృఢత్వాన్ని పెంచుతాయని కమిషనర్ పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారిణులు తమ ప్రతిభను చాటి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి పోటీలో గెలుపోట




ములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. గాయాల బారిన పడకుండా జాగ్రత్తగా ఆడాలని క్రీడాకారిణులకు హితవు పలికారు.
పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించిన ఆయన




విద్యాసంస్థలు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ప్రభుత్వం క్రీడాకారుల కోసం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ టోర్నమెంట్‌లో నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, వనపర్తి, వరంగల్ జిల్లాల నుండి క్రీడాకారిణులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి, డి.వై.ఎస్.పి పవన్ కుమార్, డి.ఎఫ్.ఏ ప్రెసిడెంట్ అడ్వైజర్ సుధాకర్, సెక్రెటరీ జావీద్‌తో పాటు అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.







# కౌలు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- **కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (డిడి 9 వార్త )**

తెలంగాణ రాష్ట్ర రైతంగం అత్యంత దయనీయా దుస్థితి ఉండి అత్యంత నిర్లక్ష్యనికి గురి ఔతున్నది కౌలు రైతులే మండలంలోని దేగామ గ్రామానికి చెందిన కౌలు రైతులతో మాట్లాడుతూ వారు సాగు చేస్తున్న పంట భూములలో వివిధ రకాలైన పండించిన పంటలను మార్కెట్లో కౌలు రైతు పేరిట అమ్ముకుందామంటే అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్న దృశ్యలను చూస్తున్న క్రమంలో ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి వారికి 2011 భూ ఆదికృత వాస్తవ సాగుదారుల చట్టాన్ని అమలు చేసి కౌలు రుణహర్హత కార్డులు ఇచ్చే విదంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలనీ రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలియపర్చడం జరిగింది.
కౌలు రైతులకు రుణహర్హత కార్డుల వలన భూ యజమానికి ఎలాంటి సంబంధం లేకుండానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తీసుకోవడానికి అవకాశాలు ఉంటాయని, మరియు తాము పండించిన పంట అకాల,అతి బారివర్షాలకు పంటలు నష్టపోతే నష్టపరిహారం వచ్చేవిదంగా, తమ పంటలను మార్కెట్లో అమ్ముకునే పెసులుబాటు కల్పించే విదంగా అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. ఎలాంటి భూమిలేని కౌలు రైతులకి రుణహర్హత కార్డుతో పాటు రైతు భరోసాతో పాటు రైతు భీమా ఉండేవిదంగా చూడవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. కానీ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపుగా 28,763 మంది కౌలు రైతులున్నట్లు మా నిర్దారణలో తేలింది. ప్రతి ఏడాదిలో కౌలు రైతులే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకున్నట్లు మా నిజ నిర్దారణలో తేలిందని, మరొక పక్క తాము సాగుచేసే పంటభూమికి కౌలు డబ్బులు మరియు పంట పెట్టుబడికి అయ్యే ఖర్చులకు ప్రయివేట్, వడ్డీ వ్యాపారస్తులనే ఆశ్రహించవలసిన అవసరం ఉందని అయన అన్నారు.గుర్తింపు కార్డు ఆధారంగా అన్ని ప్రభుత్వ పతకాలు వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులకి అందించాలి. జిల్లాలో ఉన్న వివిధ రకాలైన బ్యాంకుల ద్వారా కమిటీ వేసి వారి ద్వారా నిర్ధిష్టమైన ఆదేశాలు జిల్లా యంత్రాంగం LEC కార్డు ఆధారంగా పంట రుణాలు ఇచ్చేలా చూడవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుత ఈ ఖరీఫ్ సీజన్లో పత్తి, సోయబిన్, అంతర పంటగా కందులు,మొక్క జొన్న, పంటలను సాగు చేసుకునే విదంగా స్థానిక వ్యవసాయ అధికారులు ధ్రువీకరించి కౌలు రైతుల అడంగల్ పహాణిలో 16 వ కాలంలో ఖాస్తుదరి పేరిట ఉండే విదంగా చూడాలని అయన అన్నారు. ఇందులో పాల్గొన్న వారు కిసాన్ మిత్ర పీల్డ్ కోఆర్డినేటర్, షారుఖ్,శ్రీకాంత్, పోశెట్టి చిన్న భోజన్న, అరుణ్, అశోక్, రాకేష్, భూమన్న ,తదితరులు పాల్గొన్నారు.

# బహీరాబాద్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

**నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కమ్మర్‌పల్లి మండలం బహీరాబాద్ గ్రామ పంచాయతీ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు గ్రామంలోని మొత్తం 18 మినీ ట్యాంకులను ప్రత్యేక కూలీల సహాయంతో పూర్తిగా శుభ్రం చేయించారు. తాగునీరు కలుషితం కాకుండా ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. గ్రామంలో చేపట్టిన ఈ పారిశుధ్య పనుల పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా సకాలంలో స్పందించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ



కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు మరియు పంచాయతీ కార్మికులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.






# బోధన్‌లో భక్తిశ్రద్ధలతో వరుణ మహాయాగం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పచ్చగా పండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం బోధన్ పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో వరుణ మహాయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉదయ్ మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాసర వేదభారతి విద్యాపీఠం వేదపండితులు, వేద విద్యానందగిరి స్వామీజీల ఆశీర్వచనాల నడుమ వేదమంత్రోచ్చారణలతో యజ్ఞయాగాదులు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించి వరుణ దేవుడిని ఆరాధించారు. ప్రకృతిలో సమతుల్యత నెలకొనాలని, సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు, రైతులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ భక్తులకు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. మహాయాగం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# పోలీస్ ఇమేజ్ పెంచేలా సిబ్బంది విధులు నిర్వహించాలి

- **నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

మెండోర పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సందర్శించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై ఆరా తీశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు జరపాలని ఎస్సైని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించడమే ధ్యేయంగా ప్రతి సిబ్బంది నిక్కచ్చిగా విధి నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్స్, గేమింగ్ యాప్స్ పట్ల ఆకర్షితులై అప్పులపాలై, ప్రాణాలు తీసుకునే పరిస్థితులు తలెత్తుతున్నాయని, వీటిపై ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్లు గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మల్, మెట్ పల్లి సరిహద్దు ప్రాంతం కావడంతో వాహనాల రాకపోకలపై నిరంతర నిఘా ఉంచాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కఠినతరం చేయాలని కమిషనర్ సూచించారు. అధికారులు మరియు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. విధి నిర్వహణలోనూ, బయట కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ముఖ్యంగా ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్ సీఐ జి. జాన్ రెడ్డి, మెండోర ఎస్సై జె. సుహాసిని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# సబ్సిడీపై పత్తి విత్తనాలు అందజేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**అదిలాబాద్ జిల్లా నేరడిగొండ జులై 3(డిడి 9వార్త)**

నెరడిగొండ మండల కేంద్రంలోని రైతువేధికలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సబ్సిడీపై పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి 192 పత్తి విత్తనాల బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... రైతులు సబ్సిడీపై అందజేస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, ఏఈవోలు, సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ పిఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్, సాబ్లే సంతోష్, సుజీల్, శ్రీకాంత్ రెడ్డి, రాథోడ్ సురేందర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.





# కౌలు రైతుల కష్టం ప్రభుత్వానికి తెలియకపోవడం మా దురదృష్టం!

- కౌలు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మానుకోవాలి.
- కౌలు రైతులకు గు ర్తింపు కార్డులు ఇవ్వాలి.

**అదిలాబాద్ జిల్లా నెరడిగొండ మండలం జులై 3(డిడి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర రైతంగం అత్యంత దయనీయా దుస్థితి ఉండి, అత్యంత నిర్ల క్ష్యనికి గురి ఔతున్నది కౌలు రైతులే మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కౌలు రైతులతో మాట్లాడుతూ వారు సాగు చేస్తున్న పంట భూములలో వివిధ రకాలైన పండించిన పంటలను మార్కెట్లో కౌలు రైతు పేరిట అమ్ముకుందామంటే అమ్ముకో లేక నానా అవస్థలు పడుతున్న దృశ్యలను చూస్తున్న క్రమంలో ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి వారికి 2011 భూ ఆదికృత వాస్తవ సాగుదారుల చట్టాన్ని అమలు చేసి కౌలు రుణహర్హత కార్డులు ఇచ్చే విదంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలనీ రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలియపర్చడం జరిగింది.

కౌలు రైతులకు రుణహర్హత కార్డుల వలన భూ యజమానికి ఎలాంటి సంబంధం లేకుండానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తీసుకోవడానికి అవకాశాలు ఉంటాయని, మరియు తాము పండించిన పంట అకాల,అతి బారివర్షాలకు పంటలు నష్టపోతే నష్టపరిహారం వచ్చేవిదంగా, తమ పంటలను మార్కెట్లో అమ్ముకునే పెసులుబాటు కల్పించే విదంగా అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు.

ఎలాంటి భూమిలేని కౌలు రైతులకి రుణహర్హత కార్డుతో పాటు రైతు భరోసాతో పాటు రైతు భీమా ఉండేవిదంగా చూడవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. కానీ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపుగా 28,763 మంది కౌలు రైతులున్నట్లు మా నిర్ధారణలో తేలింది. ప్రతి ఏడాదిలో కౌలు రైతులే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకున్నట్లు మా నిజ నిర్ధారణలో తేలిందని, మరొక పక్క తాము సాగుచేసే పంటభూమికి కౌలు డబ్బులు మరియు పంట పెట్టుబడికి అయ్యే ఖర్చులకు ప్రయివేట్, వడ్డీ వ్యాపారస్తులనే ఆశ్రహించవలసిన అవసరం ఉందని అయన అన్నారు.గుర్తింపు కార్డు ఆధారంగా అన్ని ప్రభుత్వ పతకాలు వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులకి అందించాలి. జిల్లాలో ఉన్న వివిధ రకాలైన బ్యాంకుల ద్వారా కమిటీ వేసి వారి ద్వారా నిర్థిష్టమైన ఆదేశాలు జిల్లా యంత్రాంగం LEC కార్డు ఆధారంగా పంట రుణాలు ఇచ్చేలా చూడవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

ప్రస్తుత ఈ ఖరీఫ్ సీజన్లో పత్తి, సోయబిన్, అంతర పంటగా కందులు,మొక్క జొన్న, పంటలను సాగుచేసుకునే విదంగా స్థానిక వ్యవసాయ అధికారులు ధ్రువీకరించి కౌలు రైతుల అడంగల్ పహాణిలో 16వ కాలంలో ఖాస్తుదరి పేరిట ఉండే విదంగా చూడాలని అయన అన్నారు. ఇందులో పాల్గొన్న వారు కిసాన్ మిత్ర పీల్డ్ కోఆర్డినేటర్, షారుక్, బొర్ర నవీన్, పోశెట్టి, రాజు, శంకర్, అడేళ్లు, పండరి,ఉపేందర్,తదితరులు పాల్గొన్నారు.

**సంగెపు బొర్రన్న**
**రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు**
**ఆదిలాబాద్.**

# జానకంపేటలో భక్తిశ్రద్ధలతో గోదావరి జలాభిషేకాలు



- సమృద్ధిగా వర్షా లు కురవాలని గ్రామదేవతల వద్ద ప్రత్యేక పూజలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలో గ్రామదేవతలకు గోదావరి నది పవిత్ర జలాలతో శుక్రవారం ఘనంగా జలాభిషేకాలు నిర్వహించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామునే గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు బాసరలోని గోదావరి నది తీరానికి చేరుకుని వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి పవిత్ర జలాలను సేకరించారు. అనంతరం వాటిని ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చి, గ్రామంలో కొలువై ఉన్న సుమారు 60 గ్రామదేవతలకు జలాభిషేకాలు నిర్వహించారు.

గత నెలలో ఆశించిన మేర వర్షాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రకృతి సహకరించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, గ్రామ పెద్దలు తెలిపారు. ఇదే క్రమంలో ఈ ఆదివారం కూడా గోదావరి జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, గ్రామస్థులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఇదే సందర్భంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా వ్యాపార సముదాయాల నిర్మాణానికి గాను రెండు గదులకు భూమి పూజ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నిర్మాణాలతో ఆలయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని గ్రామ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో పార్టీలోకి ఉపసర్పంచ్, 30 కుటుంబాలు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యామన్న చేరికదారులు

**భద్రాచలం , జూలై 3 డిడి9 వార్త**

: భద్రాచలం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.

ఈ క్రమంలో శుక్రవారం దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కోమరం రంజీతతో పాటు 30 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారందరికీ ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ప్రజలంతా పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, ఎమ్మెల్యే వెంకట్రావు చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధిపై ఉన్న నమ్మకంతోనే తాము కాంగ్రెస్‌లో చేరామని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ముర్రం వీరభద్రం, నాయకులు బత్తుల శోభన్, గంగోలు మాజీ సర్పంచ్ మడకం చంద్రశేఖర్, నడికుడి మాజీ సర్పంచ్ తెల్లం రామకృష్ణ, భీమవరపు వెంకట రెడ్డి, యూత్ నాయకులు గాడి విజయ్, ఎండీ సుభాని తదితరులు పాల్గొన్నారు

# నిజామాబాద్‌లో గంజాయి ముఠా గుట్టురట్టు

- ఇద్దరి అరెస్ట్

**నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

నిజామాబాద్ నగరంలో గంజాయి విక్రయాలు కలకలం రేపాయి. నగరంలోని పూలాంగ్, బోధన్ బస్టాండ్ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐలు వెంకటేష్, రామ్ కుమార్, సిబ్బంది భూమన్న, విఠల్, లక్ష్మీనర్సయ్య, శివకుమార్, సాయికుమార్, శ్యాంసుందర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.





# ఫతేపూర్‌లో 'భూ భారతి' రీసర్వేపై అవగాహన సదస్సు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూ భారతి-భూముల రీసర్వే' కార్యక్రమంపై సాలూర మండలంలోని ఫతేపూర్ గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను కొలిచే విధానం, హద్దుల నిర్ధారణ, రికార్డుల ప్రక్షాళనపై రైతులకు అధికారులు సమగ్రంగా వివరించారు.భూ భారతి కార్యక్రమం ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని, తద్వారా దశాబ్దాల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలు తొలగిపోతాయని అధికారులు స్పష్టం చేశారు. రైతులు తమ భూములపై పూర్తిస్థాయి హక్కులను పొందేందుకు ఈ రీసర్వే ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు తమ పాత పట్టాదారు పాస్‌బుక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర సంబంధిత ఆధారాలను అందుబాటులో ఉంచుకుని సర్వే సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాలూర తహసీల్దార్ నవాజ్, ఫతేపూర్ సర్పంచ్ నూర్ అహ్మద్, ఉప సర్పంచ్ మోసిన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి. శ్రీనివాసులు, సీనియర్ సంచాలకులు జగదీశ్వర్, బోధన్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే దాతు, నిజామాబాద్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సీసీ ప్రథమ్, స్థానిక రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సామాన్యుల సేవలో బోధన్ రూరల్ పోలీసులు

- రికవరీ చేసిన ఫోన్ల అప్పగింత

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి, యజమానులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు, కేంద్ర ప్రభుత్వ సమాచార నిధి పోర్టల్ ద్వారా సాంకేతిక విచారణ చేపట్టి ఆ ఫోన్లను కనిపెట్టారు. రికవరీ చేసిన ఫోన్లను శుక్రవారం ఎస్.హెచ్.ఓ. రాజశేఖర్ మక్షంలో ఆయా యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.హెచ్.ఓ. మాట్లాడుతూ.. ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు నిర్దేశిత అంతర్జాల పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఫోన్ కొనుగోలు చేసినప్పుడు దాని ప్రత్యేక గుర్తింపు సంఖ్యను భద్రపరచుకోవాలని, తెలియని వ్యక్తులకు రహస్య సంకేతాలు, వ్యక్తిగత వివరాలు లేదా బ్యాంకు సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సైబర్ విభాగం నిపుణుడు విశాల్, స్టేషన్ సిబ్బంది, ఫోన్లు తిరిగి పొందిన యజమానులు పాల్గొన్నారు.



# స్కానింగ్ సెంటర్ యాజమానికి టోకరా

- రూ.70 లక్షలు కాజేసిన ఉద్యోగులు

**నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

నిజామాబాద్ నగరంలోని ఒక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు నమ్మకద్రోహానికి పాల్పడి రూ.70 లక్షలకు పైగా నగదును కాజేశారు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత ఆరేళ్లుగా ఈ మోసం కొనసాగుతోంది. సెంటర్‌లో సూపర్ వైజర్లుగా పనిచేస్తున్న గుండారం సత్యనారాయణ, మీనా పథకం ప్రకారం యాజమాన్యాన్ని మోసం చేశారు. రోగులకు అసలు మొత్తంతో రసీదు ఇచ్చి, ఆఫీసు రికార్డుల్లో మాత్రం పరీక్షల వివరాలు, ఫీజులను తక్కువగా చూపుతూ నకిలీ రసీదులను తయారు చేసేవారు. ఈ అక్రమాల గురించి ఇతర సిబ్బంది ఎవరికైనా తెలిస్తే వారిని బెదిరించడమే కాకుండా, ఆధారాలను మాయం చేయడానికి ప్రయత్నించారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో ప్రధాన నిందితుడు సత్యనారాయణ తన భార్య పేరు మీద భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణను అరెస్ట్ చేయగా మరో ఇద్దరు మహిళలు పరారీలో ఉన్నట్లు ఎస్ హెచ్ ఓ రఘుపతి వెల్లడించారు.



# ఖాజాపూర్ గ్రామంలో ఘనంగా ఊర పండుగ

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో శుక్రవారం ఊర పండుగను కులమతాలకు అతీతంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లిం సోదరులు ఎటువంటి భేదభావం లేకుండా కలిసి పాల్గొని గ్రామ దేవతలను ఆరాధించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పచ్చగా పండాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మహాలక్ష్మి మందిరం వద్ద, దర్గా వద్ద గ్రామ దేవతలను పూజించి మొక్కులు చెల్లించుకున్నామని తెలిపారు. తమ ఊరిలో హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసికట్టుగా పండుగ జరుపుకోవడం ఎంతో ప్రత్యేకమని, ఇది గ్రామంలోని ప్రజల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. పంటలు సమృద్ధిగా పండాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తామని, ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించామని గ్రామ పెద్దలు వెల్లడించారు.



# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

**బోధన్, నిజామాబాద్ జులై 03(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణంలోని బాబా గార్డెన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శంకర్ అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆయన రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంపై వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఈఎంటీ శివ మరియు పైలెట్ నరేష్ ఘటనాస్థలికి చేరుకుని వృద్ధుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను మొదట బోధన్ జిల్లా ఆస్పత్రికి, ఆపై నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# కల్లులో మద్యం కలుపుకొని తాగి వ్యక్తి మృతి!

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 03(డీడీ9 వార్త):**

బోధన్ పరిధి నర్సాపూర్ గేట్ కల్లు కాంపౌండ్‌లో విషాదం చోటుచేసుకుంది. కల్లులో మద్యం కలుపుకొని తాగిన ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అంబం గ్రామానికి చెందిన విఠల్ (47) అతని స్నేహితుడు లక్ష్మణ్ కలిసి నర్సాపూర్ గేట్ కల్లు కాంపౌండ్‌లో కల్లులో మద్యం కలుపుకొని తాగినట్లు ప్రాథమిక సమాచారం అందింది. మద్యం కలిపిన కల్లు తాగిన కొద్దిసేపటికే విఠల్ మృతి చెందారు. లక్ష్మణ్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రీ ప్రైమరీ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి

**డీ డీ 9, వార్త :**
వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలో ప్రీ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు జరిగిందని పాఠశాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు పెండ్యాల సలేంద్రం, సాంబయ్య అన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులను నమోదు చేయించడానికి గాను వారు శుక్రవారం గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు.

## విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

- **ఉపాధ్యాయులు డైరీ మైంటైన్ చేయాలి**
- **టి ఎల్ ఎం విధిగా తయారు చేయాలి**
- **పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కండక్ట్ చేయాలి**
- **ప్రీ ప్రైమరీ విద్యార్థులను నమోదు చేయాలి**
- **ములుగు ఏ ఎం ఓ శ్యాంసుందర్ రెడ్డి**

**ములుగు, డిడి 9 వార్త :**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని ములుగు ఏఎంవో శ్యాం సుందర్ రెడ్డి అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. రిజిస్టర్లు పరిశీలించి, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన బోధన చేసి వారిలో సృజనాత్మకతను పెంపొందించాలని అన్నారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు కలివిడిగా ఉంటూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేలా ప్రేరణ కలిగించాలని అన్నారు. ఉపాధ్యాయులు బోధన సమయంలో ప్రతిరోజు విధిగా డైరీ రాయాలని, బోధన కు వినియోగించేందుకు టీ ఎల్ ఎం తయారు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బండి సురేష్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పెండ్యాల సలేంద్రం, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అడవికి అసలైన యజమానులు ఆదివాసులే..

- **భూభారతి చట్టం అమలు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు..**

**జూలై డిడి9వార్త వెంకటాపురం.**
భూ భారతి పోర్టల్‌లో పోడు భూములను చేర్చిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి స్వాగతం పలుకుతూ ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) ఆధ్వర్యంలో వెంకటాపురం, వాజేడు మండలాల పోడు రైతులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దనసరి సీతక్క, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వర్ధిల్లాలని రైతులు నినాదాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి, నాయకుడు వాసం నాగరాజు మాట్లాడుతూ, అడవికి అసలైన యజమానులు ఆదివాసీలేనని, జల్-జంగిల్-జమీన్ నినాదంతో శతాబ్దాలుగా సాగిన ఆదివాసీల పోరాట ఫలితంగానే ఈ హక్కులు లభించాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో విఫలమయ్యాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి భూ భారతి పోర్టల్‌లో పోడు భూములను చేర్చడం ద్వారా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కొనియాడారు.
రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డికి వినతిపత్రం అందజేసిన అనంతరం, ఆయన చొరవతో పాటు మంత్రి సీతక్క ప్రత్యేక కృషి వల్ల పోడు భూములకు భూ భారతి పోర్టల్‌లో స్థానం లభించిందని తెలిపారు. ఈ నిర్ణయంతో ఆదివాసీ రైతులకు బ్యాంకు రుణాలు, వ్యవసాయ బోర్లు, త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లు తదితర సౌకర్యాలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. గతంలో అటవీ శాఖ అనుమతుల పేరుతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ఇప్పుడు వాటికి పరిష్కారం లభించిందని చెప్పారు.
అలాగే ఐదో షెడ్యూల్ పరిపాలనను పటిష్టంగా అమలు చేయాలని, ఎల్‌టీఆర్, పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, సాగులో ఉన్న పోడు మరియు రెవెన్యూ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.
ఈ కార్యక్రమంలో కుంజ మహేష్, మొడెం నాగరాజు, ఉపసర్పంచ్ కంతి శంకర్, పద్మ, కంతి విజయ్, పాయం బాబు తదితర నాయకులు, వెంకటాపురం, వాజేడు మండలాల పోడు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి.

- **ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి.**
- **రాష్ట్ర పరిశీలకులు వి. ఎస్ జనార్ధన్ రావు**

**డీ డీ 9 వార్త, ములుగు :**
తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుండి రాష్ట్ర పరిశీలకులు శ్రీ జనార్ధన్ రావు ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని డీ ఎన్ టి పి ఎస్ మాన్ సింగ్ తండా, వెంకటాపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటాపూర్ మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంకటాపూర్ లను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల పఠన మరియు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడానికి కృషి చేయాలని, పాఠ్యాంశాలతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ, సమస్యను స్వతహాగా పరిష్కరించుకునే సామర్థ్యం పెంపొందేలా తయారు చేయాలని వారు అన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కళలపై మక్కువ పెంచేలా మరియు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం, కంప్యూటర్ విద్య, ఏఐ టెక్నాలజీ పై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని తద్వారా పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వారు అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, యువత సహకారంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని అన్నారు.



## మణుగూరు ఏరియా ఆసుపత్రిని 100 పడకల నుంచి 150 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి..

- **గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (PHC) 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (CHC)గా ఏర్పాటు చేయాలి**
- **వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ కు వినతిపత్రాలు అందజేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**



**మణుగూరు. జూలై 3(డి డి 9వార్త)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను శుక్రవారం నాడు హైదరాబాద్‌లో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి రెండు కీలక వినతిపత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మణుగూరు ఏరియా ఆసుపత్రిలో రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్య, 130 శాతానికి పైగా పడకల వినియోగం, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల తీవ్రత, గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవల అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుతం 100 పడకలతో కొనసాగుతున్న మణుగూరు ఏరియా ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి అదనంగా 50 పడకల వార్డును ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో అత్యవసర వైద్యం, ఐసీయూ సేవలు, ప్రమాద బాధితులకు తక్షణ చికిత్సతో పాటు గిరిజన, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.
అదేవిధంగా పినపాక నియోజకవర్గంలోని గుండాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (PHC) 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (CHC)గా తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఏర్పాటు చేయాలని మరో వినతిపత్రం ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గుండాల మండలం పూర్తిగా గిరిజన, అటవీ ప్రాంతం కావడం, సమీప ఏరియా ఆసుపత్రులు 60 నుంచి 78 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో గుండాలలో సీహెచ్‌సీ ఏర్పాటు అత్యవసరమని కోరారు.అలాగే ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పినపాక నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCs), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (CHCs) మరియు ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ రెండు వినతిపత్రాలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందిస్తూ, మణుగూరు ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, గుండాలలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పినపాక నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

## సింగరేణిని రాజకీయ వేదికగా మార్చొద్దు: ఏఐటీయూసీ

- **కార్మికుల చెమటను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ విజ్ఞప్తి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 03(డీడీ9 వార్త):**
సింగరేణి బొగ్గు ఉత్పత్తి, గణాంకాల అంశాలను రాజకీయ వివాదాలుగా మార్చకుండా, వాటిపై చర్చించాల్సి వస్తే తెలంగాణ శాసనసభ వంటి అధికారిక వేదికలపై చర్చించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గనుల వద్ద మీడియా సమావేశాలు నిర్వహిస్తూ సంస్థను రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల సింగరేణి ప్రతిష్ట దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై ఆరోపణలు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం ఎవరిదైనా తప్పు జరిగితే ప్రశ్నించడం తమ విధానమని స్పష్టం చేశారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో సంస్థ పేరును రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం మానుకోవాలని, సుమారు 70 వేల



మంది కార్మికుల భవిష్యత్తు, సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. గనులపై రాజకీయ ఒత్తిడి పెరగడం కార్మికుల్లో అభద్రతను కలిగిస్తుందని పేర్కొన్నారు. సింగరేణిని రాజకీయాలకు అతీతంగా ఉంచడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, సంస్థ ప్రతిష్టను కాపాడడం, సంస్థ భవిష్యత్తును సురక్షితంగా ఉంచడమే ఏఐటీయూసీ లక్ష్యమని కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. కార్మికులంతా ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.



## విద్యార్థులకు పోషక విలువలు కలిగిన భోజనం అందించాలి

- **మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలి**
- **రాష్ట్ర పరిశీలకులు విఎస్ జనార్ధన్ రావు**
- **ములుగు ఏ ఎం ఓ శ్యాంసుందర్ రెడ్డి**

**డీ డీ 9 వార్త, ములుగు :**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనం వడ్డించాలని రాష్ట్ర పరిశీలకులు విఎస్ జనార్ధన్ రావు, ములుగు ఏఎంవో శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. ములుగు జిల్లాలోని రామచంద్రాపూర్, మాన్ సింగ్ తండా, వెంకటాపూర్, లక్ష్మీదేవి పేట పాఠశాలలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు రుచికరమైన శుచికరమైన భోజనం పెట్టాలని తెలిపారు. ప్రతిరోజు మెనూ ప్రకారం కూరలు తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని వారు సూచించారు.

## మంత్రి శ్రీధర్ బాబు అండతో కష్టపడిన వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు

- **పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ నూతన పదాధికారులకు ఘన సన్మానం**
- **పార్టీ కోసం కష్టపడితే పదవులు ఖాయం: బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 03(డీడీ9 వార్త):**
పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన ఉపాధ్యక్షుడు ఎల్లె రామ్మూర్తి, జిల్లా కార్యదర్శి రొడ్డ బాపన్న పటేల్‌లను రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సెంటినరీ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఘనంగా సన్మానించారు. ఆర్‌జీ3 ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ... మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ఆశీస్సులతో పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత గుర్తింపు లభిస్తోందన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని నూతన నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# పినపాక నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల అభివృద్ధికి నిధులు మంజూరు చేయ వలసినదిగా..

- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు. జూలై 3 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,పినపాక నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, కనెక్టింగ్ బ్రిడ్జిల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను శుక్రవారం నాడు హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గం పూర్తిగా గిరిజన ప్రాంతం కావడంతో గ్రామాల మధ్య సరైన రహదారి సౌకర్యాలు లేక ప్రజలు, విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవలు పొందే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల బీటీ రోడ్లు, హై లెవల్ బ్రిడ్జిలు, కనెక్టింగ్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించి పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

వినతిపత్రంలో మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, అల్లపల్లి, గుండాల మండలాల్లో మొత్తం 15 అభివృద్ధి పనులను రూ.37.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించారు. వీటిలో బీటీ రోడ్లతో పాటు హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం కూడా ఉంది.

వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పినపాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం సహకారంతో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన పీరినాకి నవీన్..

- **ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.**

**మణుగూరు.జూలై 3(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన పీరినాకి నవీన్ ను మణుగూరు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వార్డ్ నెంబర్లు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,మహిళ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అత్యంత ఘనంగా సన్మానించి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా,శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్లు తినిపిస్తూ నూతన బాధ్యతల స్వీకరణ సందర్భంగా అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను మరింత బలోపేతం చేస్తూ, మండల ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని ఆకాంక్షించారు.పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజలకు మరింత చేరువయ్యే నాయకత్వాన్ని అందించాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పీరినాకి నవీన్ నాయకత్వంలో మణుగూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి సేవలందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్లెం సురేష్, హరి, వార్డ్ నెంబర్స్ రాజేష్,మానస, శ్వేతన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుపూడి శ్రీను ,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు చైతన్య నాయుడు,14 టైర్ లారీ యూనియన్ సెక్రెటరి

నాగభూషన్, ట్రెజరర్ శాంతికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ్మిశెట్టి, సోషల్ మీడియా సభ్యులు నగేష్ నాయుడు, మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకు సూటబుల్ జాబ్ దిశగా అడుగులు

- **జూలై 6న కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు**
- **ఏఐటియుసి పోరాట ఫలితమేనని రంగు శ్రీను వెల్లడి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 03(డీడీ9 వార్త):**



సింగరేణి భూగర్భ గనుల్లో పనిచేస్తూ అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్‌గా మారి ప్రస్తుతం సర్ఫేస్‌లో జనరల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న మైనింగ్ స్టాఫ్, ఈ అండ్ ఎం సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్‌లకు సూటబుల్ జాబ్ కల్పించే ప్రక్రియ ప్రారంభమైందని ఏఐటియుసి ఆర్జీ 1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను తెలిపారు.

ఏఐటియుసి సమ్మె నోటీసు, అనంతరం జరిగిన చర్చల నేపథ్యంలో యాజమాన్యం స్పందించి జూలై 6న కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో సంబంధిత కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం అర్హులైన వారికి సూటబుల్ పోస్టుల్లో నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యం అంగీకరించినప్పటికీ అమలు చేయకుండా పెండింగ్‌లో ఉంచిన ఈ అంశంపై ఏఐటియుసి నిరంతర పోరాటం, లేబర్ కమిషనర్ జోక్యంతో ముందడుగు పడిందని ఆయన అన్నారు. సంబంధిత కార్మికులు జూలై 6న జరిగే వైద్య పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలని, సూటబుల్ జాబ్‌లు పూర్తిగా అమలయ్యే వరకు ఏఐటియుసి పోరాటం కొనసాగుతుందని రంగు శ్రీను స్పష్టం చేశారు.

## ఏబీఏపీ గోదావరిఖని బ్రాంచ్1 కమిటీ ప్రకటింపు

- **అధ్యక్షుడిగా డా. రవికుమార్ నాగండ్ల, ఇతర కమిటీ సభ్యుల నియామకం**
- **ప్రతి డివిజన్‌లో అయ్యప్ప ధర్మ ప్రచారం, సేవా కార్యక్రమాల విస్తరణే లక్ష్యం**
- **క్రమశిక్షణ – సేవ – భక్తి'తో ముందుకు సాగుతాం: డా. రవికుమార్ నాగండ్ల**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 03(డీడీ9 వార్త):**



అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) తెలంగాణ రాష్ట్ర వాలంటీర్స్ కమాండెంట్ జనగామ తిరుపతి అధ్యక్షతన శుక్రవారం గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో గోదావరిఖని బ్రాంచ్ 1 కమిటీని అధికారికంగా ప్రకటించారు. అయ్యప్ప ధర్మ ప్రచారం, సేవా కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తరించాలనే లక్ష్యంతో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, ప్రధాన పట్టణాల్లో బ్రాంచ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

నూతన కమిటీలో గౌరవాధ్యక్షుడిగా వంగల భాస్కర్ రెడ్డి, అధ్యక్షుడిగా డా. రవికుమార్ నాగండ్ల, కార్యదర్శిగా ఆర్.ఎస్. మూర్తి, కోశాధికారిగా రావికంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా వేరుకొండ భిక్షపతి, తాటిపాముల రాజేష్, సంయుక్త కార్యదర్శిగా లంకల రాజిరెడ్డి, వాలంటీర్స్ కెప్టెన్‌గా బొంతల భానుప్రసాద్, సెంట్రల్ ఎలక్టోరల్ మెంబర్‌గా చేరాలా దీక్షిత్‌ను నియమించారు. ఈసీ సభ్యులుగా కొమ్మ శ్రీనివాస్ యాదవ్, ఒంటేరు ప్రసాద్, కూన శ్రీకాంత్, చిలుముల రమేష్, ఆకుల సదానందం, పిట్టల సదానందం, నక్క మహేష్, అర్కటి నరేష్‌లను ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డా. రవికుమార్ నాగండ్ల మాట్లాడుతూ.... గురుస్వాముల ఆశీర్వాదం, స్వామి అయ్యప్ప అనుగ్రహంతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నానని తెలిపారు. "క్రమశిక్షణ-సేవ-భక్తి" అనే మూడు సూత్రాలను ఆదర్శంగా తీసుకుని ఏబీఏపీ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. "తత్వమసి" మహావాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి డివిజన్‌లో అయ్యప్ప ధర్మ ప్రచారం, సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... ప్రతి గ్రామం, ప్రతి అయ్యప్ప ఆలయంలో భక్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం, అయ్యప్ప తత్వం, దీక్ష నియమాలు, శబరిమల మహత్యాన్ని యువతకు చేరవేయడం, సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి పరిరక్షణకు కృషి చేయడం బ్రాంచ్ కమిటీల ప్రధాన లక్ష్యమని తెలిపారు. గతంలో బాసరలో జరిగిన ఏబీఏపీ తెలంగాణ రాష్ట్ర సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా బ్రాంచ్ కమిటీల ఏర్పాటు చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప స్వాములు, భక్తులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చివరగా ప్రతి అయ్యప్ప భక్తుడు సేవా కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

## 48వ డివిజన్‌లో కొత్త వీధిలైట్లు ఏర్పాటు

- **ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం: కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 03(డీడీ9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో వీధిలైట్లు పని చేయకపోవడంతో చీకటిగా మారిందని స్థానికులు కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందించి ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసి కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి మాట్లాడుతూ...., డివిజన్ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి సత్వర పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సహకారంతో డివిజన్ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. వీధిలైట్ల ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు, సిబ్బందికి డివిజన్ ప్రజల తరఫున ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## మణుగూరు పీకే ఓసీ డీప్ సైడ్ ఓపెన్‌కాస్ట్ గనిని సింగరేణికే కేటాయించాలి..

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేసిన..**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ లు.**

**మణుగూరు.జూలై 3 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గ అభివృద్ధి, మణుగూరు ప్రాంత ప్రజల ఉపాధి పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ తో కలిసి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక & ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారిని శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి కీలక వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రస్తుతం మణుగూరు ఏరియా పీకే ఓసీ డీప్ సైడ్ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని కేటాయింపులో సింగరేణి కాలరీస్ సంస్థ మరియు తెలంగాణ జెన్‌కో మధ్య పోటీ నెలకొన్నదని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఈ గనిని సింగరేణి కాలరీస్ సంస్థకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.ఈ గనిలో సుమారు 181 మిలియన్ టన్నుల నాణ్యమైన (G8 గ్రేడ్) బొగ్గు నిల్వలు ఉన్నాయని, గని జీవితకాలం సుమారు 20 సంవత్సరాలు ఉంటుందని, దీని ద్వారా సింగరేణికి సుమారు రూ.1,500 కోట్ల మేర లాభదాయకత ఉంటుందని వినతిపత్రంలో వివరించారు.

అదేవిధంగా ఈ గనిని సింగరేణికి కేటాయించకపోతే మణుగూరు ప్రాంత ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని, ఇప్పటికే ఉన్న గనులు దశలవారీగా మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని, శాశ్వత ఉద్యోగుల బదిలీలు, కాంట్రాక్ట్ కార్మికులు, ఓబీ కార్మికులు, లారీ యజమానులు, డ్రైవర్లు, మెకానిక్‌లు, చిన్న వ్యాపారులు, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మణుగూరు ప్రాంత భవిష్యత్తు, సింగరేణి సంస్థ పరిరక్షణ, వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో వ్యవహరించి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పీకే ఓసీ డీప్ సైడ్ ఓపెన్‌కాస్ట్ గనిని సింగరేణికే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపత్రంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందిస్తూ, మణుగూరు ప్రాంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్‌కు హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## మాట నిలబెట్టుకున్న వ్యాల్ల హరీష్ రెడ్డి..

- **అనారోగ్యంతో ఉన్న బీఆర్ఎస్ నేతకు ఆర్థిక సాయం**
- **సోమిడి రాము వైద్య చికిత్సకు అండగా నిలిచిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 03(డీడీ9 వార్త):**

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సోమిడి రాముకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామగుండం నియోజకవర్గ నేత వ్యాల్ల హరీష్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు.

రెండు రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోమిడి రామును పరామర్శించిన సందర్భంగా అవసరమైతే అండగా ఉంటానని ఇచ్చిన హామీ మేరకు, శుక్రవారం వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించి తన మాటను నిలబెట్టుకున్నారు.

కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించిన వ్యాల్ల హరీష్ రెడ్డిని స్థానికులు, పార్టీ శ్రేణులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, కొండా సురేష్, ఎండి. నిజాం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## జీడీకే1అండ్ 3 ఇంక్లైన్‌లో భద్రతా అవగాహన సదస్సు

- **అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై రెస్క్యూ బృందం శిక్షణ**
- **సీపీఆర్, అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 03(డీడీ9 వార్త):**

సింగరేణి జీడీకే 1&3 ఇంక్లైన్ గనిలో శుక్రవారం రెస్క్యూ సిబ్బంది ఆధ్వర్యంలో భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. భూగర్భ గనుల్లో సంభవించే అత్యవసర పరిస్థితులు, గ్యాస్, విషవాయువుల లీకేజీలు, విద్యుత్ ప్రమాదాలు, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి, మంటలను ఎలా అదుపు చేయాలో వివరించారు. అలాగే ప్రమాద సమయంలో ప్రాణాలను రక్షించేందుకు ఉపయోగపడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) విధానాన్ని మ్యానికిన్ సహాయంతో ప్రదర్శించి శిక్షణ ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే సరైన ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చని రెస్క్యూ నిపుణులు తెలిపారు. అనంతరం గనుల భద్రత, ప్రమాదాల నివారణ, సురక్షిత పనివిధానాల పాటింపుపై కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీడీకే1అండ్3 ఇంక్లైన్ మేనేజర్ సుధీర్ జక్కుల్‌వార్, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, నూతి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి, పిట్ ఇంజనీర్ శేఖర్, సూపర్‌వైజర్లు, రెస్క్యూ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



# ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.

**మణుగూరు.జూలై 3(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.మణుగూరు. సింగరేణి సంస్థ అధికారులకు రావాల్సిన పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (పీఆర్‌పీ) బకాయిలతో పాటు ఇతర న్యాయబద్ధమైన హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిబీజీకేఎస్ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షలో పాల్గొంటున్న అధికారులకు పూలమాలలు వేసి మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, టిబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపు మేరకు అధికారుల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం తెలుపుతున్నట్లు ఆయన చెప్పారు. సింగరేణి అధికారులకు న్యాయబద్ధంగా చెల్లించాల్సిన పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) చెల్లింపులో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు.రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను, కార్మికులను నిరాశపరిచిందని, ఇప్పుడు సింగరేణి అధికారులకు కూడా వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రాణాలకు తెగించి రేయింబవళ్లు సంస్థ అభివృద్ధి కోసం పనిచేస్తున్న అధికారుల సేవలను గుర్తించకుండా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. 2007లో పీఆర్‌పీ ఒప్పందం కుదిరినప్పటి నుంచి కోల్ ఇండియాలో ప్రతి ఏడాది పీఆర్‌పీ చెల్లిస్తున్నప్పటికీ, సింగరేణి అధికారులకు గతంలో పైసా కూడా అందలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో అధికారుల శ్రమను గుర్తించి ఎలాంటి ఆందోళనలు, నిరసనలు లేకుండానే అధికారులకు పీఆర్‌పీ చెల్లించారని గుర్తు చేశారు. ప్రస్తుతం



కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని కొనసాగించకుండా పీఆర్‌పీ చెల్లింపును నిలిపివేసి అధికారుల నోట్లో మన్ను కొట్టాలని ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

సింగరేణి సంస్థకు అధికారులు, కార్మికులు రెండు నేత్రాల వంటివారని, ఇరువర్గాలు సమన్వయంతో పనిచేస్తేనే సంస్థ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. అధికారుల న్యాయమైన హక్కులకు భంగం కలిగించే చర్యలు కొనసాగితే వారి పోరాటానికి టిబీజీకేఎస్ అండగా నిలిచి ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే అధికారుల పీఆర్‌పీ బకాయిలు, ఇతర న్యాయబద్ధమైన హక్కులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, జంగం రాజ్ కుమార్, పి కె నాగరాజు బొద్దుల ప్రవీణ్, కమటం పరమేష్, దాసుమల్ల ప్రవీణ్ కుమార్, దాసరి కృష్ణ, కోన వెంకటేష్, అజ్మీరా అశోక్ కుమార్, కల్యాణ్,ఆదర్శ్, రఘు జగదీష్ , మంగీలాల్ సర్వేశ్, రాజేష్, రఫీక్, ప్రవీణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కోట నరేందర్ నియామకం

**ములుగు,జూలై 03 డీడీ 9 వార్త**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడిగా కోట నరేందర్‌ను నియమిస్తూ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మట్టేవాడ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 2026 జూన్ 20 తేదీతో నియామక ఉత్తర్వు (ఆర్డర్ కాపీ) అందజేశారు.

ఈ సందర్భంగా మట్టేవాడ తిరుపతి మాట్లాడుతూ, ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేసి, పార్టీని ప్రజల్లో మరింత సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు కోట నరేందర్ తన వంతు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వెంటనే అమల్లోకి వచ్చే విధంగా ఈ నియామకం అమలులోకి వచ్చినట్లు తెలిపారు.

తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ వర్గాల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని నూతన జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోట నరేందర్ తెలిపారు.

# బీసీల రాజ్యాధికారమే తీన్మార్ మల్లన్న లక్ష్యం

- **జూలై 5న భువనగిరిలో సమరభేరి మహాసభ**
- **రాజ్యాధికార సమరభేరికి – భువనగిరికి తరలి వెళ్లాలి**
- **తెలంగాణ రాష్ట్ర చరిత్రలో కొత్త చరిత్రకు నాంది పలుకాలి**
- **తెలంగాణ ఉద్యమ శక్తిని మరోసారి ప్రపంచానికి చాటుదాం**
- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్ ముదిరాజ్**




**ములుగు, జులై 3, డీ డీ 9 వార్త :**

తెలంగాణ రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న పాటుపడుతున్నాడని ములుగు జిల్లా అధ్యక్షుడు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ తెలిపారు. భువనగిరి సమరభేరినీ పురస్కరించుకొని ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, భువనగిరిలో నిర్వహించనున్న బీసీల మహాసభకు సంబంధించి ములుగు జిల్లా అధ్యక్షుడిగా తాను (తవిటి దిలిప్ కుమార్) ములుగు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల జిల్లా, మండల, గ్రామ స్థాయి కుల పెద్దలు, నాయకులు మరియు ప్రజాప్రతినిధులను స్వయంగా ఆహ్వానించడం జరిగిందని తెలిపారు.

సామాజిక న్యాయం, సమాన హక్కులు మరియు రాజ్యాధికార సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మహాసభకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ, దళిత మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ లు ఐక్యంగా సమరభేరీకి తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లా అధ్యక్షునిగా హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాననీ అన్నారు.

# ములుగు నూతన బస్టాండ్ పనులను పరిశీలించిన ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్

- **ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది వసంత శ్రీనివాస్**
- **ఏటూరునాగారంలో త్వరలోనే బస్ డిపో ఏర్పాటుకు చర్యలు**

**తాడ్వాయి మండలం జూలై 03 (డిడి9 వార్త)**

ములుగు, జూలై 03 రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ (RTC) బస్టాండ్ నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆర్టీఏ (RTA) డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్ భవన నిర్మాణ ప్రగతిని, ప్రయాణికులకు కల్పించబోయే మౌలిక వసతుల వివరాలను పరిశీలించారు. బస్టాండ్ సందర్శన అనంతరం ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ గారు మీడియాతో మాట్లాడారు. మంత్రి సీతక్క ములుగు జిల్లాను అన్ని రంగా జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మరియు జిల్లా సమగ్ర అభివృద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. అందులో భాగంగానే జిల్లా జిల్లా కేంద్రంలో ప్రయాణికుల రవాణా తీర్చేందుకు అత్యాధునిక హంగులతో ఆర్టీసీ బస్టాండ్ను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని సుదూర ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు, గిరిజనులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఏటూరునాగారంలో కొత్తగా బస్ డిపోను (Bus Depot) కూడా ఏర్పాటు చేసినట్లు వసంత శ్రీనివాస్ గారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. వీటితో పాటు ములుగు జిల్లా వ్యాప్తంగా అనేక అద్భుతమైన సంక్షేమ. ప్రగతిశీల అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీగా చేపడుతోందని ఆయన కొనియాడారు. బస్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్శన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ముఖ్య నాయకులు ముక్కెర లాలయ్య, మున్నేని రమేష్, పీఏసీఎస్ (PACS) డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్, కర్రీ వెంకటేశ్వర్లు, పలువురు పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# మేడారంలో విషాదం: కారు కిందపడి బాలుడు దుర్మరణం

- **మేడారం నార్లపూర్ ఎస్సై అచ్చ కమాలకర్.**

**తాడ్వాయి మండలం**
**జూలై 03 డిడి9 వార్త ఆదాబ్**



ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వన దర్శనానికి వచ్చిన భక్తుల కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆడుకుంటున్న 7 ఏళ్ల బాలుడిపైకి కారు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన పురుషోత్తం తన కుటుంబంతో శుక్రవారం మేడారం వచ్చి MSR రూమ్స్‌లో బస చేశారు. అదే సమయంలో వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఏలూరు గ్రామానికి చెందిన అరకటిక అరుణ్ కుటుంబం కూడా వనదేవతల దర్శనానికి వచ్చి పక్క రూమ్‌లో దిగింది.

పోలీసుల కథనం ప్రకారం, అరుణ్ కుమారుడు సాకేత్, వయస్సు 4.5 ఏళ్లు, తండ్రి దగ్గర నుండి కారు తాళాలు తీసుకుని కారు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కారు స్టార్ట్ కావడంతో అది ముందుకు దూసుకెళ్లింది. అదే సమయంలో రూమ్ ముందు ఆడుకుంటున్న పురుషోత్తం కుమారుడు అలిమేకల కౌశిక్, వయస్సు 7 ఏళ్లు, కారు కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో బాలుడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.

ఈ ఘటనపై మృతుడి తండ్రి పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో MSR రూమ్స్ పరిసరాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. దర్శనానికి వచ్చి సంతోషంగా గడపాల్సిన కుటుంబంలో తీరని శోకం నెలకొంది.

# కన్నుల పండువగా శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

**(ప్రజాస్వరం)మేడ్చల్ :**



సైబరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కనుల పండుగగా జరుగుతుంది. శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా చండి ఉపాసకులు బ్రహ్మశ్రీ సంజయ శర్మ వైదిక బృందంతో శుక్రవారం ఉదయం మహాగణపతి పూజ స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య సంస్కారం, రక్షాబంధనం ఆచార్యాది రుత్విక్ వరణం, అంకురార్పణ యాగశాల ప్రవేశం, అఖండదీప స్థాపన, చతుషష్టి యోగిని సహిత వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ సర్వతోభద్ర మండప దేవత కలశస్థాపన పూజ యంత్రాభిషేకం మహిళచే కుంకుమార్చన, అగ్నిప్రతిష్ఠ గణపతిహోమం మూలమంత్రహోమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చనలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం 4 నుండి స్థాపిత దేవత హవనం సూక్త, ప్రతిష్టాంగా హోమాలు రుద్రహోమము భక్తులచే ప్రతిష్ఠ విగ్రహాలకు జలాదివాసం హారతి మంత్రపుష్పం, తీర్థ, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కుర్రాడిపై ఎందుకీ జాప్యం?.. వైభవ్ విషయంలో టీమిండియాపై డివిలియర్స్ ఫైర్!

- **వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం ఆలస్యంపై ఏబీ డివిలియర్స్ అసంతృప్తి**
- **అతడికి ఐర్లాండ్ సిరీస్ సరైన అవకాశమని.. కానీ తుది జట్టులో తీసుకోలేదని వ్యాఖ్య**
- **అసిస్టెంట్ కోచ్ టెన్ డెస్కాటే అభిప్రాయంతో బహిరంగంగా విభేదించిన ఏబీడీ**
- **ప్రపంచకప్ గెలిచిన సంజూకు అండగా నిలవడమే తమ ఉద్దేశమన్న టీమ్ మేనేజ్‌మెంట్**
- **ఐపీఎల్‌లో అదరగొట్టినా 15 ఏళ్ల వైభవ్‌కు దక్కని అవకాశంపై కొనసాగుతున్న చర్చ**






**డిడి9 వార్త :**

టీమిండియాలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన ఈ యువ ఆటగాడిని తుది జట్టులోకి తీసుకోకపోవడంపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఏబీ డివిలియర్స్ భారత జట్టు యాజమాన్యం వైఖరిని బహిరంగంగా తప్పుబట్టాడు. భారత సహాయ కోచ్ ర్యాన్ టెన్ డెస్కాటే అభిప్రాయంతో తాను ఏకీభవించనని స్పష్టం చేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

**ఏం జరిగింది?**

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడి, రికార్డులతో సంచలనాలు సృష్టించిన వైభవ్ సూర్యవంశీకి ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు టీమిండియా టీ20 జట్టులో చోటు దక్కింది. అయితే, ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ భారత్ ఓడిపోయినా అతడికి ఆడే అవకాశం రాలేదు. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్ జరుగుతున్నా, అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు.

ఈ విషయంపై భారత సహాయ కోచ్ ర్యాన్ టెన్ డెస్కాటే మాట్లాడుతూ.. "వైభవ్ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాడు, అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, మూడు నెలల క్రితం ప్రపంచకప్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన సంజూ శాంసన్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రతీ ఆటగాడిలాగే వైభవ్ కూడా సరైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది" అని వివరించాడు.

**కోచ్ వాదనను తోసిపుచ్చిన ఏబీడీ**

టెన్ డెస్కాటే వ్యాఖ్యలతో ఏబీ డివిలియర్స్ విభేదించాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. "వైభవ్‌ను ఎప్పుడు బరిలోకి దించుతారు? ఐర్లాండ్ సిరీస్ అతడికి అంతర్జాతీయ క్రికెట్‌పై అవగాహన కల్పించడానికి ఒక సరైన అవకాశం అని నేను భావించాను. కానీ, అతడికి ఛాన్స్ ఇవ్వకపోవడం దురదృష్టకరం" అని అన్నాడు.

"ప్రతీ ఆటగాడిలాగే వైభవ్ కూడా ఒక ప్రక్రియను పాటించాలన్న ర్యాన్ టెన్ డెస్కాటే అభిప్రాయంతో నేను విభేదిస్తున్నాను. ఐపీఎల్‌లో అలాంటి అద్భుత ప్రదర్శన తర్వాత అతడిని నేరుగా ఐర్లాండ్ వంటి బలహీన జట్టుపై బరిలోకి దించి, కొంత అనుభవం సంపాదించేలా చేయాల్సింది" అని డివిలియర్స్ వ్యాఖ్యానించాడు.

**రెండుగా చీలిన క్రీడా నిపుణులు**

ఈ అంశంపై క్రికెట్ నిపుణులు కూడా రెండు వర్గాలుగా విడిపోయారు. రవిశాస్త్రి, మైఖేల్ వాన్, అలిస్టర్ కుక్ వంటి మాజీ దిగ్గజాలు వైభవ్‌కు అవకాశం ఇవ్వాలని వాదిస్తున్నారు. ముఖ్యంగా సంజూ శాంసన్ గత మూడు టీ20ల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేసి విఫలమైన నేపథ్యంలో వైభవ్‌ను ఆడించడమే సరైన నిర్ణయమని వారు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఛతేశ్వర్ పుజారా, సబా కరీం వంటి వారు మాత్రం ప్రపంచకప్ గెలిచిన సంజూ వంటి అనుభవజ్ఞుడిని పక్కనపెట్టడం సరికాదని, జట్టు సమతూకం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. కేవలం 14 ఏళ్లకే లిస్ట్‌ఏ క్రికెట్‌లో సెంచరీ చేసి రికార్డు సృష్టించిన వైభవ్, ఐపీఎల్‌లో కూడా తన బ్యాటింగ్ విధ్వంసంతో అందరి దృష్టిని ఆకర్షించాడు. కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఐర్లాండ్ చేతిలో సిరీస్ ఓటమి తర్వాత జట్టుపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో జరగబోయే మ్యాచ్‌లలోనైనా టీమ్ మేనేజ్‌మెంట్ తన వ్యూహాన్ని మార్చుకుని ఈ యువ కెరటానికి అవకాశం ఇస్తుందో లేదో చూడాలి.

# జీవో 111 కు తూట్లు



జంట జలాశయాలను పరిరక్షిస్తూ
హైదరాబాద్,సికింద్రాబాద్ జంట నగరాలకు త్రాగునీటి భద్రత
కల్పించేందుకు తీసుకొచ్చిన 111 జీఓ అమలు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా
మారింది. జీవో111 పరిధి లో 84 గ్రామాలను మినహాయిస్తూ 10 కిలోమీటర్ల విస్తీర్ణం లో
భావి తరాల భవిష్యత్తు కోసం ఉమ్మడి రాష్ట్రల ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి అర్జునరావు నేతృత్వంలో
1993 లో జీవో 111 పేరుతో ఉత్తర్వులను జారీ చేసారు.చెరువు నాలాలు బఫర్ జోన్ లు ఆక్రమణకు గురైతే వెంటనే స్పందించే
హైడ్రా అధికారులు మహానగరానికి ప్రాణాదారమైన త్రాగు నీరు అందించే నీటి వనరులైన ఉస్మాన్ ,హిమాయత్ సాగర్ లు అక్రమార్కుల
చెరలో చిక్కి శల్యమవుతుంటే ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు
దీంతో జీవో 111 నియమ నిబంధనలను తుంగలో తొక్కి బ్రదర్స్ సారథ్యంలో సాగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాల పై ఏ ఒక్క అధికారి
నోరు మెదపక పోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది.ఆనాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం 111 జీవో లో ఉన్న ఆస్తులను కాపాడుకునేందుకు ఏకంగా
జీవో 111 నే సడలించేందుకు కుయుక్తులు పన్నారు పలు మార్లు ఎన్జీటీ ని ఆశ్రయించారు అయినప్పటికీ ప్రభుత్వానికి ఎన్ జి టీ నుండి
చుక్కెదురైంది.దీంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పాలకుల యొక్క అత్యాశకు చెక్కుపెట్టింది.అదే సమయంలో కొడంగల్ ఎంఎల్ ఏ
గా ఉన్న రేవంత్ రెడ్డి 111 జీవో ను పరిరక్షించాలని వందలాది పిర్యాదులు (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ )ఎన్ జి టీ కి చేసింది
వాస్తవం కదా ?
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేటికి రెండున్నర సంవత్సరాలు పూర్తి అయింది కానీ ఆనాడు 111 జీవో ను కాపాడాలని
వందలాది పిర్యాదులు చేసిన రేవంత్ రెడ్డి వందలాది బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతుంటే ఎందుకు
చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**డిడి9 వార్త,స్పెషల్ ఇన్వెస్టిగేషన్ విభాగం హైదరాబాద్**



సీఎంసీ పరిధిలో
అంతులేని అక్రమ నిర్మాణాలు
చెరువు నాలాల పరిరక్షణ సరే...
జంట జలాశయాలా
పరిస్థితి ఏంటి...
చెరువులు కుంటల
పరిరక్షణకేనా హైడ్రా?
జంట నగరాలకు త్రాగునీరు
అందించే జంట జలాశయాలను
విస్మరించారా?
ఒక్క కమిషనరేట్ ఉన్నప్పుడే మేలు
మూడు కమీషనరేట్లున్న
ప్రయోజనం శూన్యం
కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి
గండి కొడుతున్న అక్రమ
నిర్మాణదారులు
అక్రమ నిర్మాణ
దారులకు బ్రదర్స్ అండ
గడపదాటని
సీఎంసీ కమీషనర్ సృజన
"మామూళ్లు"తో సరే అంటున్న
క్షేత్ర స్థాయి అధికారులు
అవినీతికి అడ్డాగా మారిన టౌన్
ప్లానింగ్ విభాగం
ముఖ్యమంత్రి శాఖలోనే
అవినీతి తాండవిస్తోంది

ముఖ్యమంత్రి యొక్క ప్రధాన గౌరవప్రదమైన మునిసిపల్ శాఖలో అవినీతి అక్రమాలు కోకొల్లలుగా జరుగుతున్నాయని విమర్శలు అత్యధికంగా వినిపిస్తున్నాయి.పిల్లి చీకటిలో పాలు తాగుతూ ఎవ్వరు చూడట్లేదు అనుకున్నట్లుగా మునిసిపల్ శాఖలో అవినీతికి పాల్పడడం చాలా సులభమే అంతే సులువుగా చేసిన అవినీతి అందరి కళ్ళకు కట్టినట్టు కనపడుతోంది అని తెలిసి కూడా తప్పులు చేయడం వెనుక సరైన చర్యలు తీసుకోకపోవడమే ఉన్నతాధికారుల వైఫల్యం అంటూ మేధావులు ఆరోపిస్తున్నారు. సీఎంసీ పరిధిలో 111 జివో ఉల్లంఘన,చెరువులు నాలాలు బఫర్ జోన్ ల అక్రమణ షరామాములే అన్నట్లుగా నిర్మాణ దారులు టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక్కటై చేస్తున్న అవినీతి అక్రమాలకు వందల కోట్ల ప్రభుత్వ సంపద దుర్వినియోగం అవుతుంది అని ఆరోపణలు వినిపిస్తున్నాయి..అంతే కాదు తెలుగు రాష్ట్రాల ఉభయ ముఖ్యమంత్రుల ప్రధాన విభాగంలో పనిచేస్తున్న ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారుల మద్దతు గౌలిదొడ్డి లో నెలకొన్న ముప్పై వేల చదరపు గజాల్లో నిర్మాణాల్లో జరుగుతున్న కార్పొరేట్ పాఠశాల ది శ్రీ రామ్ అకాడమీ పుష్కలంగా మద్దతు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ది శ్రీ రామ్ అకాడమీ పాఠశాల యాజమాన్యం పై డిడి9 వార్త వరుస కథనాలు ప్రచురించడం తో నార్సింగి టౌన్ ప్లానింగ్ అధికారులలో చలం వచ్చి పనులు ఆపుచేసి నోటీసులు జారీ చేయనున్నట్లు ఏసీపీ ఎన్ ప్రసీద తెలిపారు. అయినప్పటికీ కూడా అధికారుల నోర్లు నొక్కి



యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగించడం వారియొక్క అర్ధరాజకీయ బలానికి నిదర్శనం నిలుస్తుంది.ఈ విషయం హైడ్రా అధికారులకు తెలిసిన ఏమీ చెయ్యలేని పరిస్థితి నెలకొంది. అంటే గరీబోడి ఇల్లులు కూల్చే హైడ్రా సంపన్న వర్గాలు నిర్మించే అక్రమ నిర్మాణాలు వైపు వెళ్లేందుకు సాహసించక పోవడం వెనుక ఆంతర్యం ఏమిటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.హైడ్రా అధికారులకు న్యాయస్థానాలు మొట్టికాయలు వేసిన తమ పంథా మార్చుకుని పరిస్థితి లేదని సంపన్నులను వదిలి గరీబొళ్లు పై తమ పెత్తనాన్ని చలాయించడం పిచ్చుక పై బ్రహ్మాస్త్రమే అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు.

**నార్సింగి సర్కిల్ జివో 111 లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలివే**

నార్సింగి సర్కిల్ జనవాడ వద్ద శంకర్ పల్లి వెళ్లే రోడ్డు మార్గంలో రోస్ట్ క్రంచ్ కేఫ్ దగ్గర సిల్వర్ రీస్ట్రీట్ పక్కన కుడి వైపున భారీ షెడ్డు(దాబా)





అక్రమ నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. అలాగే కొంచెం దూరంలో శంకర్ పల్లి వెళ్లే మార్గంలో మోకిల పోలీసు స్టేషన్ ఇవతల ప్రధాన రహదారి వెంబడి ఎడమ వైపు భారీ ఫంక్షన్ హాల్ 111 జివో ను ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణం, కేఫ్ జో పక్కన సిల్వర్ వుడ్ వెనుక వైపు నాలాను ఆక్రమించి జరుపుతున్న షెడ్డు దాని పక్కననే మరో షెడ్డు అక్రమంగా 111 జిఓ ను ఉల్లంఘిస్తూ మరో అక్రమ నిర్మాణం బహిరంగంగానేచేపడుతున్నారు.అంతేకాదు జనవాడ మేకల గడ్డ గ్రామంలో ఫియాస్టా ఎదురుగా నిర్మిస్తున్న భారీ కాటేజెస్ జి ఓ 111 లోనే ఉండడం గమనార్హం. అదే దారిలో ఫియాస్టా దాటిన తరువాత ఎడమ వైపు పొలిమేర దగ్గర భారీ షెడ్డు అక్రమ నిర్మాణం కూడా సాగుతుండడం స్థానికులు ఆరోపించిన ఆరోపణలకు సాక్ష్యాలుగా నిలిచాయని స్థానికులు ఆరోపిస్తున్నారు

**మూటలు చేతులు మారడమేన కారణం**

ఆనాడు జీవో 111 ను బ్రతికించాలంటూ తహ తహ లాడిన వ్యక్తులు ఈనాడు ఆ వ్యవహారం పై నోరు మెదపకపోవడం మూటలు చేతులు మారటమేనంటూ స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.111 జీవో లో ఇంత అరాచకం జరుగుతున్న సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజన అక్రమాలను అడ్డుకోకపోవడం వెనుక బ్రదర్స్ ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీఎంసీ పరిధి లో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయినప్పటికీ, అలాగే జీవో 111 కు తూట్లు పొడుస్తు ఆకాశాన్నంటే అక్రమ నిర్మాణాలు సాగిస్తూ ప్రభుత్వ ఖజానాకు వేలాది కోట్ల రూపాయలు గండి కొడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక "షాడో" వ్యవస్థ ప్రభుత్వ యంత్రాంగాన్ని శాశిస్తుందనీ విమర్శలు వినిపిస్తున్నాయి ఇంట గెలిచి రచ్చ గెలవాలనే నానుడి మాట ముఖ్యమంత్రి తన సొంత మునిసిపల్ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలను పసి గట్టలేని ముఖ్యమంత్రి భయట జరుగుతున్న అవినీతి అక్రమాలను ఎలా ఆపగలడని ప్రజలను ఎలా కాపాడగలడని ఏ నోట విన్నా ఇదే మాట వినిపించడం గమనార్హం.ఇప్పటికైనా ముఖ్యంత్రి స్పందించి తన శాఖ అయిన మునిసిపల్ జరుగుతున్నా అవినీతి అక్రమాలపై ప్రత్యేక టాస్క్ ఫోర్స్ నియమించి చర్యలు తీసుకోవాలని మేధావులు సైతం డిమాండ్ చేస్తున్నారు



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.